# 19. రాబందులు

సత్యనారాయణ ఇంజను నిలబెట్టి అటువేపే చూస్తున్నాడు తూర్పు చివరను రైలు పట్టీలకు కుడిచేతి వేపు ఆవొకటి చచ్చిపడివుంది. రాబందులు దానిమీద వాలి పొదుగును పొడుచుకు తింటున్నాయి.

"చూడండి సార్! ఇది మా డ్రైవరు ఆదినారాయణగారి ఆవు. పూటకు మూడు లీటర్లు పాలిచ్చేది. ఇంజను నడపడం తెలియని దౌర్భాగ్యుడెవడో నిష్కారణంగా పాడి ఆవును చంపేశాడు సార్!" అన్నాడు షంటరు సత్యనారాయణ.

మారుమూలనున్న ఆ ప్రాంతంలో వున్నట్లుండి రైలింజనులు నడిపే డ్రైవర్లు, షంటర్లు, ఫైర్మనులు, కళాసీలు అందరూ సమ్మెచేశారు. ఈ సమ్మె చాలా వింతఅయినది. సాధారణంగా సమ్మె జరుపుతున్న ఉద్యోగులు బైఠాయించో, నినాదాలు చేస్తునో సమ్మెసాగిస్తారు. కాని ఈ సమ్మెలో మాత్రం తుపాకీగుండు పేల్చినా ఒక్కడయినా లేకుండా అందరూ పరారయిపోయారు. అలా అందరూ పారిపోయి నేటికి మూడు రోజులయింది. వాళ్ల ఊరికి దూరంలో వున్న అడవుల్లోకి పారిపోయారు. తిండీ తిప్పలు లేకుండా, మంచినీళ్ళుకూడా ఒక ప్పుడు దొరక్క, ముళ్ళు గుచ్చు కుని ఒళ్ళు చీరుకుపోతున్నా లక్ష్యంచేయకుండా వాళ్ళు కలిసికట్టుగా సమ్మె చేస్తున్నారు.

అటువంటప్పుడు ఈ సత్యనారాయణ ఎలా జతపడ్డాడు?

సత్యనారాయణ అమ్మకు చిక్కిన మేక అయిపోయాడు.

సమ్మెకు నెల్లాళ్ళు ముందే శ్రీకాకుళం పక్కనున్న గ్రామానికి కుటుంబాన్ని తీసుకొని వెళ్ళిపోయాడు. నాలుగా రోజులు సెలవుపెట్టి, జ్వరం కాయడంతో నలభై రోజులవరకు వుండిపోయాడు కుటుంబాన్ని గ్రామంలోనే విడిచి, ఒక్కడే విజయనగరం నుంచి బస్సులుమారి బయలుదేరిన రెండో రోజు మధ్యాహ్ననికి పనిచేస్తున్న ఊరు చేరుకున్నాడు. బస్సులో ఏవో వార్తలు తెలిసినా అతను అంతగా పట్టించుకోలేదు. నెల్లాళ్ళకు పైగా వుద్యోగంలో చేరలేదాయె. ఉద్యోగం వున్నదో, ఊడిందో తెలియదు. అది పోతే నడివీధిన పడటమే.

బస్సు దిగిన సత్యనారాయణ తిన్నగా ఆఫీసుకేసే నడిచాడు, టీ అయినా తాగకుండా. ఆఫీసులో ఫోర్మెను, గుమాస్తాలు వున్నారు. ఫోర్మెను పక్కనో పెద్దమనిషి కూర్చున్నాడు.

"నమస్కారం సార్!" సత్యనారాయణ ఫోర్మెను గారికి దండంపెట్టాడు భయం భయంతో.

ఆ ఫోర్మెను భీమసేనుడు చాల కోపిష్టి: కాని, ఎందుచేతనో ఇప్పుడతని గంభీరమైన ముఖంలో వెన్నెలవంటి నవ్వు వెలిగింది.

"సార్! మీ ప్రాబ్లెముకి సమాధానం దొరికింది సార్! షంటరు సత్యనారాయణ నలభై అయిదు రోజుల నుండీ ఉద్యోగం నుంచి అబ్స్కాండయ్యాడు. ఇదే వస్తున్నాడు. మీరు అప్పుడే ఆర్డర్లు పాసుచేశారు. ఈ మనిషిని తీసివేయమని. కాని, నాదొక చిన్న మనవి. ఇతని సంసారం పెద్దది, ముసలి తల్లి,అయిదుగురు పిల్లలు - వూరంతా అప్పులు - ముఖ్యమైన జీవనాధారం ఈ ఉద్యోగమే. నాకోసమయినా ఇతనిని క్షమించి వెంటనే డ్యూటిలోకి తీసుకొండి సార్!"

ఆ ఆఫీసరు ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేవాడు. అంతవరకు ఏమీ పాలుపోక ఏడుపు ముఖం పెట్టిన పెద్దమనిషి తమాయించుకున్నాడు.

మూడ్రోజులయి రైళ్లన్నీ ఆగిపోయాయి. ఆవూరు అన్నిటికీ దూరంగా వుంది. రైలు మీదనే దానిని చేరుకోవడం సులభం. సమ్మె గురించి ముందుగా వ్యాపారస్తులకే తెలుసు. నిజానికి వారు సమ్మెచేస్తున్న ఉద్యోగులకి భోజనాల ఏర్పాటు చేస్తున్నారని వినికిడి. సమ్మె జరిగిన రెండవరోజున ఉప్పుధర కిలో రెండురూపాయలయి పోయింది. మూడో రోజు పొద్దున్నకు అయిదురూపాయలైంది. మధ్యాహ్నానికి బజారులో ఒక్క పిసరు కూడా దొరకకుండా పోయింది. ప్రజలు వ్యాపారస్థులు అందరూ మూకుమ్మడిగా రైల్వేస్టేషను మీద పడ్డారు.

రైళ్ళెప్పుడు నడుపుతారు?

స్టేషనుమాస్టరు ఒక విషయంచెప్పాడు, నాలుగు వేగన్లనిండా వుప్పుబస్తాలున్నాయి.

కాని అవి యార్డులో తూర్పు చివరకున్నాయి. మరొక డిపార్టుమెంటు వాడిచేత ఇంజను నడిపించి ఆ నాలుగు వాగన్లను గూడ్సుషెడ్డువేపు తీసుకుపోవాలని ప్రయత్నించారు. వాడు సరిగా నడపలేక రెండు వాగన్లను పట్టాలనుండి వెలుపలికి తోసి వేశాడు. మిగిలిన రెండు వాగన్లను ఎలా గూడ్సు షెడ్డుకు తరలించారో తెలియడం లేదు. ఇంజను నడిపించ వలసిన డ్రైవర్లు కాని, షంటర్లుకాని లేరాయె.

ఆ వాగన్ల దగ్గిరకి లారీలుకూడా పోలేవు, దారిలేదు. ఉన్నచోటునుండే వాగన్ల నుండి బస్తాలు దింపి తీసుకొని పోడానికి వర్తకులు నిరాకరించారు. ఎందుచేతనంటే చాల బస్తాలలో ఉప్పు సగంవరకే వుందని ఎవరో అన్నారు. నష్టం రేల్వే వాళ్ళు భరించరు. వర్తకులు సరేసరి. మరి ప్రజలా?

సాయంకాలం సరికి ఉప్పు వాగన్లు గూడ్సు షెడ్డుకి తరలించకపోతే వాగన్ల తలుపులు విరక్కొట్టి దోచుకుంటామన్నారు.

"వెంటనే ఇతనిని ఉద్యోగంలో చేరమనండి. ఇతనికి పనిష్మెంటుగా రాత్రీపగలు పని చేయించండి. బాగా పనిచేస్తున్నట్లు నమ్మకం కుదిరితే డిస్చార్జ్ ఆర్డరు కాన్సిల్ చేస్తాను."

"సార్! నాకు రెండురోజులయి నిద్ర లేదు. స్నానంలేదు. భోజనంకూడా సరిగా లేదు. రెండు మూడు గంటలు నాకు వ్యవధియిస్తే సాయంకాలానికి డ్యూటీలో చేరతాను" అన్నాడు సత్యనారాయణ.

"ముందు ఛార్జిషీట్ జారీ చెయ్యండి!" అన్నాడు. ఆఫీసరు.

ఫోర్మెన్ భీమసేనారావు సత్యనారాయణని పక్కకు తీసుకొనిపోయాడు.

"నీకు ఉద్యోగం నిలవడమేకాదు, కావలసినంత డబ్బు దొరుకుతుంది. ఒవర్‌టైమ్ కుప్పలు. ఎమర్జన్సీ కదా!నీకు భోజనం అన్నీ దొరగారే ఏర్పాటు చేస్తారు. నెల్లాళ్ళజీతం నీకు వారం రోజులలో కిడుతుంది."

ఇంకా సత్యనారాయణ నీళ్లు నములుతున్నాడు.

"చెప్పు ! ఇంకా ఏవైనా సందేహాలా?"

"లేదు సార్! పొద్దుటినుండీ ఒక కప్పు టీకూడా తాగలేదు, వున్న డబ్బంతా బస్సుఛార్జీలకే సరిపోయింది. ఒక పాతిక రూపాయలు అడ్వాన్సుగా ఇప్పించండి సార్!"

భీమసేనారావు వెంటనే పదిరూపాయల నోటు పర్సులోంచి తీసి సత్యనారాయణ చేతిలో పెట్టాడు.

"వెంటనే ఇంజనెక్కు. భోజనం ఇంజనుమీదికే పంపుతాం."

అప్పటికి మధ్యాహ్నం ఒంటిగంటయింది.

ఇంజనుకి నమస్కారం చేశాడు సత్యనారాయణ. ఏదో పెద్ద తప్పు చేస్తున్నట్లు మనస్సు పీకుతోంది. తనకుచాలామంది డ్రైవర్లు ఆపదలో సహాయంచేశారు. తాను సెలవుమీద వెళ్ళకుండా వుంటే వాళ్ళతోపాటు అడవులు చేరిపోయే వుండును. పది మందితోపాటు తానూ.

కాని ఈ పరిస్థితి చాల చెడ్డది. అవసరం తీరిపోగానే అధికారులు ఒక్కతాపు తంతారు. కావలసినవాళ్ళంతా తాను చేసిన నీచమయినపనికి కక్ష కడతారు.

సత్యనారాయణ పారిపోదామనుకున్నాడు, అడవులవేపు.

కాని వెంటనున్నారు ఇద్దరు యములు.

సత్యనారాయణ ఇంజనెక్కాడు; అతని తోపాటు ఆఫీసరుకూడా.

"తూర్పుచివరకు నడిపించు" ఆఫీసరు ఆదేశించాడు.

"సార్! చాలా ఆకలిగా వుంది సార్ నిన్న మధ్యాహ్నంనుంచీ ఏమీ తినడానికి వీలు చిక్కలేదు."

"సత్యనారాయణా! నీకు మంచి లంచి ఆర్డరు చేస్తాను. బండి నడిపించు."

ఇంజను కదిలింది. సిగ్నలు చూపిస్తూ జమదారు ముందునడుస్తున్నాడు. కపులింగ్ తగిలించే పోర్టరు ఇంజనుమీదికి ఎక్కాడు.

"సత్యనారాయణ! నీకు లంచి ఇంజనులోకే తెస్తారు. ఇకమీదనుంచి సమ్మె ముగిసే వరకూ ఈ ఇంజనే నీకు ఇల్లు - అన్నీ నీ దగ్గిరకే వస్తాయి." అన్నాడు సానునయంగా ఆఫీసరు.

"లంచి అంటున్నారు,అందులో స్వీటు, పెరుగు వుంటాయా?"

"కాంటీను భోజనంలో స్వీటుండదు. రాత్రికి డిన్నరులో అన్నీ వుంటాయి".

"సార్! రాత్రికి స్వీటు తెప్పిస్తే బజారు నుండి తెప్పించండి సార్! ఈ కాంటీను స్వీటు ఏమీ బాగోదు"

"ఓయస్! బండి వేగంగా పోనీ"

తూర్పు చివరకు వచ్చేసరికి సత్యనారాయణ కడుపులో ఆకలి అంతా మాయమైపోయింది.

కుడిచేతివేపు రైలు కట్టాల పక్కన తెల్లటి ఆవు పడివుంది. ఇంజను దానిమీద నుంచి ఎవరో నడిపించారు. లైను చివరల పట్టీల మధ్య బాగా గడ్డి మొలుస్తుంది. దానికి ఆశపడి వచ్చిన ఆవు ఇంజను ఆపడం చేతకాని వాడి చేతులలో పడి చచ్చిపోయింది. ఆవు రెండుగా తెగి పడివుంది. రైలులైను మీద నుంచి దానిని పూర్తిగా తీసివేయలేదు. నాలుగయిదు రాబందులు దానిమీద వాలి పొదుగు పొడుచుకు తింటున్నాయి. ఇంజను విజిల్ శబ్దం విని అవి బరువుగా రెక్కలు ఆడించుకుంటూ కొంచెం పక్కకు తప్పుకున్నాయి.

"మా చంటిపాపకు యీ ఆవుపాలే తెచ్చుకుంటాం.- ప్రొద్దున్న అర లీటరు, సాయంత్రం అరలీటరు- ఈ వూళ్లో పాల డబ్బాలు కొని భరించలేం సార్!"

"అవునవును" అన్నాడు ఆఫీసరు, పరధ్యానంగా.

ఇంజను ఆ ఆవును దాటి వాగన్లవేపు నడిచింది. ఉప్పుబస్తాలున్న రెండు వాగన్లు పోర్టరు తగిలిస్తున్నాడు.

"ఆదినారాయణ చాలా మంచివాడు సార్! పాలకిడబ్బిస్తే నవ్వుతూ వద్దన్నాడు సార్! చంటిపాపకు ఇచ్చిన పాలకు అతను డబ్బు పుచ్చుకోడు సార్. మరో యిద్దరు పిల్లలకు కూడా ఇస్తున్నాడు సార్! చుట్టాలెవరేనా వస్తే, పాలు కొనుక్కుంటారు. కాని చంటిపిల్లలకిచ్చే పాలు మానీయడు సార్."

"కపులింగ్!" వెనుక నుంచి పోర్టరు కేకలేశాడు.

సత్యనారాయణ ఇంజను నడపడంలేదు ఆలోచిస్తున్నాడు. అతని కళ్ళవెంట అప్రయత్నంగా రెండు నీటిబొట్లు రాలాయి.

వెనుక నుంచి పోర్టరు అరుస్తున్నాడు.

"ఈ వూళ్ళో మంచి పాలు దొరకవు.నెలకో నూరురూపాయలు కలిసివచ్చేవి. ఆ ఒక్క సహాయాన్ని నాశనం చేశారు. మా ఆదినారాయణ ఆవును చంపేశారు సార్"

సత్యనారాయణ కళ్ళలో ఇంకా నీళ్ళు తిరిగాయి.

ఆఫీసరు లేచి నిలబడ్డాడు సత్యనారాయణ భుజం తట్టాడు.

"అయామ్ సారీ, సత్యనారాయణ! ఏదో మరోదారి దొరుకుతుంది. ముందు పనిచూడు! ఆలస్యమైతే వూరివాళ్ళంతా మనమీద పడతారు."

సత్యనారాయణ కళ్ళు తుడుచుకున్నాడు. విజిల్ కొట్టి ఇంజను నడిపించాడు.

సత్యనారాయణ పని ముగిసేసరికి సాయంకాలమవ వచ్చింది.

భోజనం చల్లారిపోయింది.

రాత్రి ఆఫీసరు వూళ్ళోంచి స్వీటు తెప్పించి సత్యనారాయణకు పంపించాడు. ఏమీ పనిలేదంటూ రాత్రి- పగలు అతనిచేత స్టేషనుమాస్టరు పని చేయించాడు.

ఆదివారం మధ్యాహ్నం సమ్మె మొదలయింది. చుట్టుపక్కల గ్రామాలనుండి సంతలో అమ్మడానికి కాయగూరలు తెచ్చినవాళ్ళు సాయంకాలంసరికి మిగిలిన సరుకుతో ఫ్లాట్‌ఫారముమీద కూర్చున్నారు. బళ్ళన్నీ నిలిచిపోయాయి. పాసింజరు బళ్ళను కూడా నడపడం మానేశారు.

ప్రయాణీకులంతా ఒకటే గోల.

ఆ సాయంకాలానికి ఆఫీసరు సమ్మె జరిగేచోటికి హుటాహుటిగా జీపుమీద చేరుకున్నాడు. అతనితోపాటు అతని బంట్రోతులు, మిగిలిన బలగం వచ్చారు. రాత్రి వంటకి కావలసిన కాయగూరలన్నీ చవకగా ఫ్లాట్‌ఫారమ్ మీదనే దొరికాయి.

అందుకే ఆ రాత్రి ఆఫీసరు చాలాసంతోషించాడు.

వేడివేడిగా, స్టఫ్‌చేసి ఫ్రై చేసిన కాకరకాయలు చాలాబాగున్నాయి.

క్రమక్రమంగా కూరలన్నీ కరువైపోయాయి. సంతకువచ్చిన కూరల వాళ్ళు తమతమ గ్రామాలు నాటు దారిన చేరుకోడానికి రెండురోజులు పట్టింది.

స్టేషను ఫ్లాట్‌ఫారమ్ నిర్మానుష్యంగా వుంది. ఒక్క ప్రయాణికుడు కూడా లేడు. అప్పుడప్పుడు రైల్వే ఉద్యోగస్తులు, పోలీసులు మాత్రం అక్కడ కనిపించేవారు.

రోజూ వంటవాడు బంగాళదుంపలే వండుతున్నాడు.

ఆఫీసరుకి చాలా చిరాకుగా వుంది. కర్మ! తప్పదు!!

అయిదోరోజుకేనా సమ్మె ముగుస్తుందని రైల్వేవారు, రాష్ట్రప్రభుత్వం వారూ భావించారు. కాని సమ్మెజోరయిపోయింది. తక్కిన చోట్లకు కూడా వ్యాపించే ప్రమాదం ఏర్పడింది.

పెద్దలందరూ ఫ్లాట్‌ఫారమ్‌మీదనున్న పోలీసు కార్యాలయంలో సమావేశమయారు.

"ఇప్పుడు బలప్రయోగం చేయాలి అంతవరకూ సమ్మె ముగియదు" అన్నాడు ఇనస్పెక్టర్ పండా.

"అంటే?" ఆఫీసరుకి సరిగా అర్థం కాలేదు

"దీనికో టెక్నిక్ వుంది. అయిదు నిమిషాలలో సమ్మె పటాపంచలవుతుంది."

"ఏవిధంగా?"

"సమ్మెచేసి అడవులకు పారిపోయిన వారు ఉద్యోగులు. సమ్మె లేకుండా ఇళ్ళలోవున్న వాళ్ళు వారి భార్యలు, పిల్లలు. కుటుంబంలోనివాళ్ళను హింసిస్తే, సమ్మెచేస్తున్న పెద్ద మనుషులు రంగంలోకి వస్తారు" అన్నాడు ఇనస్పెక్టరు.

"కుటుంబాలను ఏవిధంగా హింసిస్తారు?" ప్రశ్నించాడు ఆఫీసరు.

"లాఠీ చార్జి చేస్తాము"

"సుతరాం నేను అంగీకరించను."

"కుటుంబంలోని వాళ్ళను కొట్టనక్కరలేదు. ఇంటిముందునున్న పూల మొక్కలను, వాటి చుట్టూ కట్టుకొన్న దళ్ళను నాశనం చేస్తాము. ప్రజలలో గాలి వార్తలు పంచిపెడతాం."

" ఈ పద్ధతి కూడా నాకు అంతగా నచ్చదు. ఇక్కడి వాళ్ళు చాల శ్రద్ధగా ఇళ్ళ చుట్టూ ఆవరణలు కట్టుకొని, మంచి మంచి పూలమొక్కలు పెంచుతున్నారు, ఏళ్ళతరబడి. ఈ స్టేషను అలంకారానికి, శుభ్రతకు పేరు పొందింది. అందాన్ని మట్టిపాలు చేయడం నాకు సమ్మతం కాదు."

"మిస్టర్ ఆఫీసర్! ఒక సంగతి మీకు తెలుసా? ఈ సమ్మెవలన రోజుకు పది లక్షల రూపాయల ఆదాయం పోతున్నది. మమూలు నాలుగోతరగతి ఉద్యోగికిమల్లే మీరూ మాట్లాడితే ప్రభుత్వం నవ్వుతుంది."

ఆఫీసరు నోటికి తాళం పడింది.

ఆరో రోజు పోలీసుదళాలు కాలనీమీద మెరుపుదాడి చేశాయి.

ఊళ్లో ఎన్నో వార్తలు అల్లుకొన్నవి. ఇళ్ళు విరక్కొట్టారని, ఆడవాళ్లను, పిల్లలను చితక్కొట్టారని చూచినట్లుగా చాల మంది చెప్పారు. పొగలెగసి నిప్పు భగ్గుమంది.

పరారయిన ఉద్యోగులు అందరూ సాయంకాలానికి ప్లాట్‌ఫారమ్ మీద హాజరయారు. అందరూ చేతులిచ్చారు సంకెళ్ళకు. బాధలు తాము పడతామన్నారు; పెళ్ళాలనూ, పిల్లలనూ, పెంచిన మొక్కలను విడిచిపెట్టమన్నారు.

వారి మాసినగడ్డాలు, లోతుకుపోయిన బుగ్గలు, గూళ్ళలోకి ఇంకిన కళ్ళు, ఆరురోజులై వాళ్ళు పడుతున్న కష్టాలను వ్యక్తం చేస్తున్నాయి.

నాయకులని పదిమందినిమాత్రం అరెస్టు చేశారు. వెంటనే వారిని పోలీసు వానులో ఇరవై మైళ్ళ దూరంలో నున్న జిల్లా సెంట్రల్ జైలుకు తీసుకొనిపోయారు.

అంతటితో సమ్మె అంతం కాలేదు.

ఉద్యోగులు ఉచితమయిన కోరిక ఒక్కటే కోరారు. ఎన్నో కోరికలకయి సమ్మెచేసినా, వాటినన్నింటినీ వెనుకకుంచారు. అరెస్టు చేసిన పదిమంది సహోద్యోగులను విడిపించి తెస్తే పనిలో చేరతామన్నారు.

పొద్దున్న ఎనిమిది గంటలకు పోలీసు స్టేషనులో సంప్రదింపులు మొదలయాయి.

పోలీసులు ఇప్పుడు బిగిసిపోయారు. ఖైదులో పెట్టడమే వారిపని. విడిపించడం మరొకరిది.

అరెస్టు చేసినవారి భార్యలు, పిల్లలు తిండి తిప్పలు మాని ఏడుస్తున్నారు.

ఆఫీసరు చిక్కుల్లోపడ్డాడు. పై అధికారులకు ఫోన్‌చేశాడు. వారు రాజధానిలోని మంత్రాంగానికి ఫోనులు చేశారు. చట్టమొకటి అడ్డంవచ్చింది. కోర్టులో, అరెస్టుచేసిన ఉద్యోగులు నిర్దోషులని తేలేవరకు వారిని ఉద్యోగాలకు తీసుకోడానికి వీలు లేదు. కాని, వారిని బెయిలుమీద విడిపించుకోవచ్చు.

సమ్మెచేస్తున్న ఉద్యోగులు దానికే సమ్మతించారు. ఉద్యోగంలేకపోయినా తమకోసం జైలుకు పోయినవారు కుటుంబాలతో కలిసి వుంటే అదే చాలునన్నారు. ఆ పది కుటుంబాలను పోషించడమో పెద్ద సమస్యకాదని అన్నారు.

అప్పటికి సాయంకాలం అయిదు గంటలయింది.

బెయిలుమీద వెంటనే విడిపించి తీసుకొనివస్తే ఆ రాత్రే రైళ్ళు నడుపుతామన్నారు, ఉద్యోగులు. జిల్లాముఖ్యపట్టణానికి త్వరగా వెళ్ళాలంటే రైలుబండి శరణ్యం.

వెంటనే సత్యనారాయణకు కబురు వెళ్ళింది. గార్డు పెట్టెను ఇంజనుకు తగిలించుకొని అతను ప్లాట్‌ఫారమ్ లైనుమీదకు వచ్చాడు.

ఆఫీసరు, పోలీసు ఇనస్పెక్టరు, ఇద్దరు డ్రైవర్లు బయలుదేరారు.

కాని వాళ్ళు సత్యనారాయణ బండి నడుపుతే ఇంజనెక్కమన్నారు ఉద్యోగుల ఐకమత్యానికి వెన్నుపోటుపొడిచిన బందిపోటు దొంగ ఇంజను నడుపుతే వాళ్ళు ముందుకు రామన్నారు. బెయిలుమీద విడిపించడానికి హామీగా వుండటానికి కూడా వాళ్ళు నిరాకరించారు.

మరి యింజను ఎవరు నడుపుతారు?

ఇది సమ్మెచేస్తున్న సోదరులమేలుకోసం చేయవలసినపని కాబట్టి, ఆయిద్దరు డ్రైవర్లలో ఒకరు యింజను నడపడానికి అంగీకరించారు. రెండవవాడు కోపంతో రెక్కపట్టుకొని సత్యనారాయణను కిందకు దింపి పీకపట్టుకొని తోసివేశాడు.

ప్లాట్‌ఫారమ్ మీద అందరూ నవ్వుతున్నారు.

నాలుగు రోజులయి నిర్విరామంగా, రాత్రిళ్ళూ, పగళ్ళూ పనిచేస్తూ, ప్రభుత్వ గౌరవం నిలబెట్టిన సత్యనారాయణకు అవమానం జరుగుతుంటే ఆఫీసరు మహాశయుడు ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

జైలునుంచి రాబోతున్న వీరులకు స్వాగతమివ్వడానికి స్టేషను ప్లాట్‌ఫారమ్ మీద పెద్ద వేదిక, లైట్లు, మైకు అన్నీ ఏర్పాటుచేస్తున్నారు. జనసందోహంతో ఆ ప్లాట్‌ఫారమ్ శోభిల్లింది.

చీకటి పడింది. క్షణక్షణానికి నిరీక్షణతో- క్షణక్షణం ఆశతో వాళ్ళు ఎదురు చూశారు.

వందల కొలది ప్లాట్‌ఫారమ్ నిండిపోయారు. దేదీప్యమానంగా మెర్క్యురీ దీపాలు వెలుగుతున్నాయి. మైకు ముందర కొంతమంది అడవులలో పడ్డ బాధలు చెప్తున్నారు. ఎవరూ ఉపన్యసించకపోతే దేశ భక్తి గీతాలు వినిపిస్తున్నారు.

ప్యారేలాల్ ఆవూళ్లో చాల పలుకుబడి వున్నవాడు. అతను ఈ రైల్వే ఉద్యోగులకు చాల సన్నిహితుడు. వడ్డీ తీసుకుంటే తీసుకున్నాడు, చాల మందికి అవసరానికి డబ్బు సర్దేవాడు. అతను ఆఫీసరు గారు వచ్చిన వెంటనే కలిశాడు. అతని భోజనానికి ఏర్పాటు చేస్తానన్నాడు. అతను ఏవీ వద్దంటే సన్నటి పలావ్ బియ్యం ఓ పాతిక శేర్లు పంపుతానన్నాడు. ఆయన అన్నిటికీ నమస్కారం పెట్టి, తనకు కనిపించకుండా వుంటే అదే పదివేలుగా భావిస్తానని ఆ పెద్దమనిషిని పంపించివేశాడు.

ప్యారేలాల్ చాల అనుభవమున్నవాడు. ఇటువంటి ఆఫీసర్లను ఎంతమందినో చూశాడు.

ఏదో రోజు పొద్దున్న సంప్రదింపులకు ఆఫీసరు తయారయి వెళుతుంటే, బస దగ్గరే అతనిని కలిసి నమస్కారంచేశాడు.

"సాహెబ్! మీరు నాముఖం చూపించవద్దన్నారు. ప్యారేలాల్ ప్రభుత్వానికి మిత్రుడనే సంగతి మీకు తెలియదు. మూడోరోజునుండి వాళ్ళందరినీ ఉద్యోగంలో చేరమని బ్రతిమాలాను. అయినదేదో అయింది. అందరూ వచ్చారు. కాని వీళ్ళు ఒక విషయంఅడగడంమరచిపోయారు. ఇవాళ జీతాలు ఇవ్వవలసిన రోజు. జీతాలు అందకపోతే వీళ్ళెవరూ పనిలోకి వెళ్ళలేరు. మీరూ ఈ సమస్యను చిన్నదిగా తలచవద్దు. జీతాలిచ్చే ఏర్పాటులు చేస్తే, ఇంకా వాళ్ళు సంతోషంతో పనిచేస్తారు" అన్నాడు అప్పులిచ్చే పెద్దమనిషి.

ప్యారేలాల్ స్వార్థం తెలియని వాడుకాడు ఆఫీసరు. ఆ వూళ్లో అప్పులిచ్చే పెద్దమనుషుల సంఘానికి ఇతను అధిపతి. ఒకరోజయినా రావలసిన వడ్డీ వెనుకబడితే ప్రాణాలే పోయినట్లు బాధపడతాడు. ఒకటి మాత్రం నిజం. ఉద్యోగులు దీనమయిన పరిస్థితులలో వున్నారు. జీతాలు దొరికితే వాళ్ళు తనతో సహకరిస్తారు. వెంటనే జీతాలగురించి టెలిఫోనులో మాట్లాడి రాత్రి అయినా జీతాలను ఇప్పించడానికి కట్టుదిట్టాలు చేశాడు.

జీతాల గుమస్తా, అతని పరివారం, సాయంకాలానికి వచ్చారు. వేదికకు కొద్ది దూరంలోనే టేబులు, కుర్చీలువేసి, జీతాలు ఇచ్చే ఏర్పాటులు చేశారు. వుద్యోగులు చాలా సంతోషించారు. జైలునుంచి తోటి ఉద్యోగులు తిరిగి రాగానే జీతాలు తీసుకోడం, రైళ్ళను నడపడం తథ్యమన్నారు.

రాత్రి తొమ్మిది గంటలయింది. క్షణక్షణానికి ప్రజలలో అశాంతి పెరిగింది. అప్పుడు తెలిసింది, జైలులోని వాళ్ళను విడుదల చేయలేదని. విడుదల చేయించవలసిన బృందం ఆరుగంటల ముప్పై నిమిషాలకు జైలుకు చేరుకున్నారు. సాయంకాలం ఆరుగంటలు దాటిన తరువాత ఎటువంటి పరిస్థితులలోను, ఏ పెద్ద అధికారులు నిర్ణయించినా, ఖైదీలను విడిచిపెట్టరు. మరునాడు ఉదయంవరకు ఎట్టి ప్రయత్నమూ ఫలించదు.

ముఖాలు వేలవేసుకొని వెళ్ళినవారు తిరిగివచ్చారు. కనీసం ఉద్యోగులు జీతాలేనా తీసుకోవలసిందని కోరాడు ఆఫీసరు. వాళ్ళందరూ ఆగ్రహావేశులై, వేదిక విరక్కొట్టి, లైట్లుబద్దలుచేసి వెళ్ళిపోయారు. పిట్ట మనిషికూడా జీతం తీసుకోలేదు.

సత్యనారాయణ దగ్గిరకి ప్యారేలాల్ వచ్చాడు.

"అరే బచ్చా! జీతం తీసుకో! నీకు వాళ్ళకీ సంబంధంలేదు" అన్నాడు.

సత్యనారాయణ అంగీకరించలేదు. ఇప్పటికే అందరూ అంటరానివానిగా అతనిని చూస్తున్నారు. ఈ పాతకమొకటి సంపాదించి ఇంకా చెడ్డవాడవడానికి అతను ఒప్పుకోలేదు.

మరునాడు ఉదయమే అందరూ వెళ్ళి, జైలులోనివారిని విడిపించుకొని పదకొండు గంటలకు వచ్చారు. అందరూ జీతాలు తీసుకొని మధ్యాహ్నం పన్నెండునుంచీ పనిచేయడం మొదలుపెట్టారు.

ప్యారేలాలు, ఇంకా అతని సహచరులు సంతోషంతో తమకు రావలసిన వడ్డీలు వసూలుచేసుకుంటున్నారు.

సాయంకాలంసరికి చాలామంది జీతాలు తీసుకున్నారు.

చీకటిపడింది. రాత్రి ఏడుగంటలయింది. ఒక్కడే జీతం తీసుకోకుండా మిగిలిపోయాడు.

సత్యనారాయణ ఎప్పటికీ రాకపోతే ప్యారేలాల్ వెళ్ళిపోయాడు.

ఏడుగంటలన్నర అయింది. ఎనిమిది గంటల ప్యాసింజరులో వెళ్ళిపోడానికి జీతాల వాళ్ళు తయారవుతున్నారు. జీతాలిచ్చే గదిలో మరెవరూలేరు. కాషియరు బిల్లులు తీసి కట్టలు కడుతున్నాడు.

పాసింజరుకి లైన్ క్లియరయింది.

భయం భయంగా నాలుగు వేపులూ చూసుకుంటూ సత్యనారాయణ గదిలోకి ప్రవేశించి కాషియరువేపు దీనంగా చూశాడు.

"మరేమనుకోకండి! మీకు తెలుసుకదా! నా ముఖం నలుగురికి చూపించడానికి సిగ్గవుతున్నది."

అసలు రహస్యం కాషియరుకు తెలుసు. అప్పులిచ్చే వారినుండి తప్పించుకోడానికి ఇదో ఎత్తు.

సత్యనారాయణకు నిండు జీతం దొరకలేదు. నూరురూపాయలే బిల్లయింది. ఈ నాలుగు రోజులు పడ్డ శ్రమకు ప్రతిఫలం వచ్చేనెల దొరుకుతుంది.

లోపలిజేబులో పర్సులో జాగ్రత్తగా ఆ పది పదిరూపాయల నోట్లు పెట్టుకొని బయటికి వచ్చాడు. రోజూ ఇంటికివెళ్ళే దారిలో చాలామంది కనిపిస్తారు. స్టేషనుయార్డులో లైనుదాటి ఎవరికీ కనపడకుండాపోతే, రేపు వాళ్ళందరికీ సమాధానాలు చెప్పవచ్చు.

ప్యాసింజరు వచ్చింది. అందరూ పరిగెడుతున్నారు- బోగీలు ముందుకులాగారు. సత్యనారాయణ ప్లాట్‌ఫారమ్ రెండవ చివర నుంచి లైను దాటాడో లేదో వెనుక నుంచి ఎవరో పొడుగాటి వ్యక్తి వచ్చి సత్యనారాయణ భుజం పట్టుకున్నాడు.

"అరే బద్మాష్! ప్యారేలాల్ కళ్ళలో కారం కొడతావురా! వచ్చిన నూరురూపాయలు లోపలి జేబులో పెట్టుకొని ఎక్కడికి పోతావురా! ముందు నా ఏభైయిచ్చేయి".

"ప్యారేలాల్ గారూ! ఈ నెలకు మాత్రం ఒక్కయిరవై తీసుకొండి. వచ్చేనెల ఇస్తాను."

"ముందు యాభై యిచ్చేయి. మళ్ళా లేనప్పుడు అప్పు పట్టుకెళ్ళు."

సత్యనారాయణ మాటాడకుండా ఏభైరూపాయలు యిచ్చి ముందుకు నడిచాడు. రెండోలైను దాటేసరికి మునీంజీ వచ్చాడు. అతనూ యిదేపద్దు. తన వంతు ఇరవై రూపాయలు తీసుకున్నాడు. మూడోలైను దాటేసరికి పండిట్‌జీ వచ్చాడు. అతను తన పదిహేను తీసుకున్నాడు.

సత్యనారాయణ జేబు పట్టుకున్నాడు. పిచ్చిగా ఎంతమందికి పంచాలి? వెర్రిగా పరుగెత్తుతున్నాడు.

పరిగెడుతున్న సత్యనారాయణ భుజం మీద ఎవరో వెనకనుంచి బలంగా చరిచారు అతను ఆగిపోయాడు.

"బద్మాష్! లుచ్చా!సువర్‌కా బచ్చా! ఇదిరా చేస్తావ్! పెళ్ళాం పురుడయి మందులకు డబ్బులేదంటే అప్పిచ్చినాన్రా! క్రిందటి నెల వడ్డీ ఎగ్గొట్టి పారిపోయావు తియ్యి. జేబులో ఎంతుందో తియ్యి" అరిచాడు, గొంతెత్తి శర్మాజీ.

పిచ్చిగా చూస్తూ గట్టిగా రెండు చేతులతోను సత్యనారాయణ జేబుపట్టుకున్నాడు.

"ఉల్లూ! తియ్యరా" గట్టిగా చొక్కాపట్టి లాగాడు శర్మాజీ. చొక్కా చిరిగిపోయింది అప్పటికీ సత్యనారాయణ పట్టువిడువలేదు.

శర్మాజీ ముఖం మీది స్ఫోటకంమచ్చలు యార్డులైట్ల వెలుగులో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అతని గుడ్లనుంచి నిప్పులు కురుస్తున్నాయి. మనిషి పొట్టివాడైనా, వడ్డీలతో బలిసిపోయాడు శర్మాజీ.

సత్యనారాయణ పెనుగులాడాడు మరో పదినిమిషాలు.

శర్మాజీ చాచి కాలితో సత్యనారాయణ డొక్కలో తన్నాడు దానితో రైలుపట్టాలు తన్నుకొని బాధతో పడిపోయాడు సత్యనారాయణ, తెలివితప్పి.

సత్యనారాయణకు ఏ రాత్రో తెలివివచ్చింది. రెండురోజులై తిండిలేదు. ఆకలికి కడుపులో బాధ- డొక్కలో తాపు-

మంచి వెన్నెల వచ్చింది. చిన్నగాలి రివట వీచింది.

సత్యనారాయణకు మరికొంచెం తెలివి వచ్చింది. చూచాడు. ఏదో భరించరాని చెడువాసన కొడుతున్నది. రాబందులు సగం తినగా మిగిలిన ఆవు పక్కనేవుంది.

మళ్ళా సత్యనారాయణకు తెలివితప్పి పోయింది. మరునాడు ఉదయం ఆ రాబందులు వస్తాయి.

ఆవుతోపాటు తనను కూడా ఆరగిస్తాయని అనుకున్నాడు సత్యనారాయణ మళ్లా తెలివి వస్తే.

బహుశా ఈ రాబందులే నయమేమో!

(స్వాతి - మాసపత్రిక)

☆